# 6 గ్యారంటీలు ఎగ్గొట్టినందుకా కాంగ్రెస్ సంబరాలు

- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికేనా బైకు ర్యాలీ
- హడావుడిగా బైక్ ర్యాలీలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉంది
- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి..



**పరిగి, సెప్టెంబర్ 5 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ విషయం మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా బాగా తెలుసు హామీలను నెరవేర్చకుండా, ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ నాయకులు మరో కొత్త డ్రామాలు..మూడేళ్ల పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేకపోయినా, "వెయ్యి రోజుల సంబరాలు" అనడం సిగ్గుచేటని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ కుండా, ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ నాయకులు మరో కొత్త డ్రామాకు తెరలేపారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ నిర్వహిస్తున్న సంబరాలు, బైక్ ర్యాలీలపై పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేపై, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అటకెక్కించి, రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి వెయ్యి రోజుల సంబరాలు చేసుకునే నైతిక హక్కు ఉందా అని ఆయన నిలదీశారు. మూడేళ్ల కాలంలో ప్రజల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఏమి ఉద్ధరించారని, సిగ్గులేకుండా వెయ్యి రోజుల సంబరాలు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారని ఘాటు విమర్శలు చేశారు.రాష్ట్రంలో హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనే నగ్నసత్యం ఆ పార్టీ మంత్రులతో పాటు, స్థానిక ఎమ్మెల్యేకు, ఇతర నాయకులకు కూడా బాగా తెలుసని మహేష్ రెడ్డి స్పష్టం చేశారు. అయినప్పటికీ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, అమాయక ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు మరో కొత్త డ్రామాకు తెరలేపారని ఆయన ధ్వజమెత్తారు. పరిగి నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ప్రజల సమస్యలను గాలికొదిలేసి కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారని స్థానిక ఎమ్మెల్యేపై ఆయన తీవ్ర ఆరోపణలు గుప్పించారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా స్థానిక ఎమ్మెల్యే అమలు చేయలేకపోయారని, ప్రజలు ఈ మోసాలను గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న ఈ వెయ్యి రోజుల ప్రజా వ్యతిరేక, అరాచక పాలనపై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి అపూర్వమైన స్పందన, మద్దతు లభిస్తోందని మహేష్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నిరసనలకు వస్తున్న ప్రజాదరణను, ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను చూసి ఓర్వలేకనే, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు హడావుడిగా బైక్ ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా హాస్యాస్ప దంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా డ్రామాలు కట్టిపెట్టి, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, లేనియెడల ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన తరిమి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మా జీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- దోమ మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహణ..
- ప్రత్యేక పూజలు, భజనలు



**దోమ, సెప్టెంబర్ ( తెలంగాణ దైలి న్యూస్ ) :** దోమ మండల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాలకృష్ణుడి విగ్రహాలను అందంగా అలంకరించి పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. భక్తులు పాలు, పెరుగు, వెన్న, పండ్లు తదితర నైవేద్యాలను సమర్పించారు. పలుచోట్ల చిన్నారులకు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణ చేయించి వేడుకల్లో భాగస్వాములను చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**మార్మోగిన కృష్ణ నామస్మరణ**

ఆలయాల వద్ద భజనలు, కీర్తనలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణనామస్మరణ చేశారు. రాత్రి వేళ ప్రత్యేక పూజలు నిర్వహించి బాలకృష్ణుడిని ఉయ్యాలలో వేసి ఊరేగించారు.శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. ధర్మాన్ని కాపాడుతూ సత్యం, నీతి మార్గంలో నడవాలని పలువురు సూచించారు. గ్రామాల్లో వేడుకలను విజయవంతం చేసేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# యథావిధిగా విధుల్లోకి

## గ్రామపంచాయతీ కార్మికుడు నర్సిములు



**పూడూరు,సెప్టెంబర్ 5 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తుర్కఎన్కేపల్లి గ్రామంలో సర్పంచ్ మంజుల వెంకటేష్, తో గతంలో గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న చిన్నపాటి మనస్పర్థలను మనసులో పెట్టుకొంటే గ్రామంలో మంచివి కాదు.. గ్రామ సర్పంచ్ మంజుల వెంకటేష్, ఆదేశాల మేరకు కార్మికులు నడుచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ సైతం కార్మికులు తెలిసి తెలియక పొరపాట్లు చేస్తుంటారు ఓ సర్పంచిగా మీరు కూడా దాన్ని పెద్దగా చేయకుండా లోపల మాట్లాడుకుని ఆ సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పూడూరు మండల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత కింది నరేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ ఏసు మాదిగ మండల అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ప్రకాష్ మాదిగ ధనరాజ్ మాదిగ ఎంఎస్పి మండల అధ్యక్షుడు మల్లేష్ మాదిగ తదితరులు పాల్గొని కార్మిక విషయమై మాట్లాడడం జరిగింది

# వెయ్యి దినాల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేసింది గుండు సున్నా

- రాష్ట్రంలో అన్ని వర్గాలకూ మిగిలింది నిరాశే..
- జూటా కోరు కాంగ్రెస్ పై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి




**గండిడ్, సెప్టెంబర్ 5 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా, ఆ పార్టీ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గండిడ్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా మండల ప్రజలను కార్యకర్తలను ఉద్దేశించి కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం ప్రజలకు ఆరు గ్యారంటీలు, వందలాది ఆకర్షణీయమైన హామీలను గుప్పించిందని గుర్తుచేశారు. కానీ నేడు అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఆనాడు ఇచ్చిన ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని, ఇది ముమ్మాటికీ ప్రజలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలు తీవ్రమైన సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మహేష్ రెడ్డి విమర్శించారు. రైతులకు సరిపడా సమయానికి ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా నిధులు ఎగ్గొట్టడం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనిపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

**అన్ని వర్గాలకూ నిరాశే..**

మహిళలకు ఇస్తామన్న ఆర్థిక సహాయం, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, పేద ప్రజలకు ఇళ్ల నిర్మాణం వంటి ఏ ఒక్క అంశంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యబుచ్చుతున్న స్థానిక ఎమ్మెల్యే తీరును, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఆయన తీవ్రంగా ఎండగట్టారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి గ్యారంటీని అమలు చేసే వరకు బీఆర్ ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజల పక్షాన నిలబడి రాష్ట్రవ్యాప్తంగా, మండల స్థాయిలో నిరంతరం పోరాటాలు సాగిస్తామని మహేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ మండల స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత హామీలతో కాంగ్రెస్ విధ్వంస పాలన



- జడ్చర్లలో వృద్ధులు, వికలాంగులతో కలిసి లక్ష్మారెడ్డి నిరసన

**జడ్చర్ల, సెప్టెంబర్ 5 ( తెలంగాణ దైలి న్యూస్ ):** కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల దగా పాలనను నిరసిస్తూ జడ్చర్ల పట్టణంలో మూడో రోజు నిరసన కార్యక్రమం అత్యంత హోరాహోరీగా కొనసాగింది. జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో వృద్ధులు, మహిళలు, ఆడబిడ్డలు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ విధ్వంస పాలనపై ఈ సందర్భంగా తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ వంటా-వార్పు కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులతో కలిసి మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ వాల్యా నాయక్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వృద్ధులకు పింఛన్లు, మహిళలకు ఆర్థిక సాయం, వికలాంగులకు సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పి మాట తప్పిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రాష్ట్రంలో విధ్వంస పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వ మోస పూరిత వైఖరిని ఎండగట్టేందుకే బీఆర్ఎస్ పార్టీ తరఫున ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు స్పష్టం చేశారు.అనంతరం వంటా వార్పు కార్యక్రమంలో భాగంగా వికలాంగులు, మహిళలు, వృద్ధులతో కలిసి మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి నేలపై కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చదువుల కోసం పంపితే చాకిరీ చేయిస్తారా

- ఎస్సీ సమీకృత హాస్టల్‌లో విద్యార్థులతో వంట సామగ్రి సరఫరా
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆకాష్ నాయక్





**షాద్‌నగర్, సెప్టెంబర్ ( తెలంగాణ దైలి న్యూస్ ) :** విద్యార్థులకు చదువుతో పాటు భద్రమైన వాతావరణం కల్పించాల్సిన హాస్టల్‌లో వారితోనే పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని ఎస్సీ సమీకృత హాస్టల్‌లో కూరగాయలు, పండ్లు, గుడ్లు, ఇతర వంట సామగ్రిని తరలించే పనుల్లో విద్యార్థులను వినియోగిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆకాష్ నాయక్ తీవ్ర ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హాస్టల్ నిర్వహణలో భాగంగా అవసరమైన సరుకులను తీసుకురావడం, తరలించడం వంటి పనులను సిబ్బంది చేయాల్సి ఉండగా, విద్యార్థులతో ఆ పనులు చేయించడం సరికాదన్నారు. విద్యార్థులు చదువుకోవాల్సిన సమయంలో వారితో పనులు చేయించడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపించారు. విద్యార్థులు వంట సామగ్రిని తరలించే క్రమంలో అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. చిన్న నిర్లక్ష్యం కూడా విద్యార్థుల భద్రతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్‌కు పంపేది చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశతోనే తప్ప, పనులు చేయడానికి కాదని స్పష్టం చేశారు. హాస్టల్‌లో విద్యార్థులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను పరిశీలించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

